యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



విద్యార్థులతో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.సూర్యప్రకాష్

కాచిగూడ: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఎంఎస్ఎస్ న్యాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ అన్నారు. వర్ణిక ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది కాసుల వినోద్ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అమృత అర్కేడ్‌లో 'జీవితంలో విజయం సాధించడం ఎలా..?' అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో విలువలు ముఖ్యమన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నుంచి విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీని అలవర్చుకుంటే జీవితంలో విజయం సాధించగలరన్నారు. ప్రస్తుత సమాజంలో పోటీ ఎక్కువగా ఉందని, దానిని తట్టుకుని నిలబడగలిగే మానసిక దృఢత్వాన్ని ప్రతి విద్యార్థి పెంపొందించుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా ఇష్టపడి చదివినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఒక ఆలోచన జీవితాన్నే మార్చివేస్తుందని విద్యార్థులు తమ ఉన్నత భవిష్యత్తు గురించి ఆలోచించాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది కానుగు దేవేందర్, కాసుల మల్లికార్జున్, లక్ష్మణ, గంగాభవాని, అనికేత్, వర్ణిక, శృతిక, విశాంత్, అనన్య, వరుణ్, శ్లోక తదితరులు పాల్గొన్నారు.

ఏవీ కళాశాలలో కొత్త కోర్సులు



ప్రిన్సిపాల్ సీ.హెచ్ రాజలింగం

కవాడిగూడ: నగరంలోని ప్రతిష్ఠాత్మకమైన ఏవీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కామర్స్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం డిగ్రీ స్థాయిలో నాలుగు కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.హెచ్ రాజలింగం తెలిపారు. ఈ కోర్సులను విద్యార్థులు పూర్తి చేస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా నైపుణ్యాభివృద్ధి పెంచే దిశగా దోహదపడతాయని వివరించారు. శనివారం దోమలగూడ గగన్‌మహల్ ఏవీ కళాశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ... డిగ్రీలో బీఏ జర్నలిజం, డేటా సైన్స్, బీకాం ఫైనాన్స్, బయో టెక్నాలజీ కోర్సులను నూతనంగా ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు.



దోమలగూడ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల ప్రధాన ద్వారం

ఈ నాలుగు కోర్సులకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్‌లో వివరాలను పొందుపరిచామన్నారు. విద్యార్థులు గమనించి ఈ కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని ఆయన వివరించారు.

- బీఏ జర్నలిజంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్ లిటరేచర్, జర్నలిజం ఐచ్ఛికంగా ఎంచుకోవచ్చన్నారు.
- డేటా సైన్స్‌లో గణితం, కంప్యూటర్ సైన్స్‌లను ఐచ్ఛికంగా ఎంచుకోవచ్చని పేర్కొన్నారు.
- బీకాం ఫైనాన్స్ కోర్సును కొత్తగా ప్రవేశపెడుతున్నామని లైఫ్ సైన్స్ విభాగంలో ఈ విద్యా సంవత్సరంలో బయో టెక్నాలజీ కోర్సును అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కళాశాల కరస్పాండెంట్ కె.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా రాము



నల్లకుంట: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది ఎం. రాము నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సీహెచ్.బాల్‌రాజ్, బొల్లు కిషన్, కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ తదితరులు రామును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్, టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ లీగల్ సెల్ పటిష్టానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కారానికి కృషి



సంజయ్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సంజయ్‌నగర్ బస్తీవాసులు డ్రైనేజీ సమస్యపై కార్పొరేటర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించిన ఆయన అక్కడికి చేరుకుని డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ జ్యోతిని పిలిపించి త్వరితగతిన డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు గడ్డం సతీష్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలని అంబర్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్- 16 ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత స్వచ్ఛ ఆటో కార్మికులకు సూచించారు. శనివారం అంబర్‌పేట చెత్త డంపింగ్ కేంద్రం వద్ద స్వచ్ఛ ఆటో కార్మికులతో ఆమె ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సలహాలు సూచనలు చేశారు. అంబర్‌పేటలో చెత్త డబ్బాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దామని దానికి మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు సహకరించాలన్నారు. చెత్త సేకరణ కోసం కేటాయించిన నివాసాలకు ప్రతిరోజూ చెత్తను సేకరించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆటో కార్మికులను ఆదేశించారు. ప్రజలు సైతం స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను అందించి పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఆమె కోరారు. స్వచ్ఛ ఆటో కార్మికులు ప్రభుత్వం నుంచి ఎలాంటి వేతనం లేకుండా పనిచేస్తున్నారని ఏఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఏలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆటోకార్మికులతో ఏఎంహెచ్ఓ హేమలత

ఉపాధిరంగాల్లో ఉచిత శిక్షణ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ చౌరస్తా సమీపంలోని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) సంస్థ కార్యాలయంలో జూన్ మొదటివారం నుంచి వివిధ ఉపాధి రంగ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు నిరుద్యోగ యువతీయువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తమ వద్ద శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తున్నామన్నారు. 18-28 ఏళ్ల లోపు యువతీ యువకులు పదోతరగతి పాసైన వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, రిటైల్ ట్రైనింగ్, కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేషన్ ఇంగ్లిష్ తదితర కోర్సుల్లో స్వల్పకాల వ్యవధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు రాంనగర్ కార్యాలయం 9052485742.

'గోల్డెన్ అవర్' ఎఫెక్ట్: సైబర్ క్రైం మోసగాళ్ల నుంచి రక్షణ

రూ. 14.7 లక్షలు రికవరీ

హిమాయత్‌నగర్: ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ ఓ రిటైర్డ్ మహిళ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన రిటైర్డ్ మహిళ ఉద్యోగికి(62) ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ చేస్తున్నామని నమ్మించారు. కొరియర్ ద్వారా 960 గ్రాముల కొకైన్‌తో పాటు 5 కిలోల బట్టలు, 7 నకిలీ పాస్‌పోర్ట్‌లు, 5 క్రెడిట్ కార్డులతో పార్శిల్ ఉందని క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో వీడియో కాల్ చేశారు. బాధితురాలిని భయపెట్టి బ్యాంక్ ఖాతాను వెరిఫై చేయాలంటూ.. రూ. 14,73,400 కాజేశారు. అప్రమత్తమైన బాధితురాలు వెంటనే గంట వ్యవధిలోనే (గోల్డెన్ అవర్‌లో) సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు నగదును ఫ్రీజ్ చేసి బాధితురాలికి అందజేశారు. ఇలాంటి మోసపూరిత ఫోన్‌కాల్స్ వస్తే బాధితులు వెంటనే అప్రమత్తమై 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని పోలీసులు సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాల పేరుతో మోసం

ఖైరతాబాద్: జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి 30 మంది నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆసిఫ్‌నగర్‌లో ఉండే సాయికుమార్ పదవ తరగతి ఫెయిల్ అయ్యాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో తాను జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తానని, తనకు అధికారులతో పరిచయాలున్నాయని 30 మందిని నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. మొదట ఎంట్రీ ఫీజు కింద రూ. 10 వేలు, ఐడీ కార్డు జారీ చేయగానే రూ. 15 వేలు, జాయినింగ్ కాగానే మరో రూ. 15 వేలు ఇలా ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు మొత్తంగా రూ. 10.5 లక్షలు వసూలు చేశాడు. వారికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్, శానిటేషన్ వర్కర్లుగా నకిలీ ఐడీ కార్డులు చేయించాడు. జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ కార్యాలయం పరిధిలో ఏఎంఓహెచ్ సంతకంతో ఐడీ కార్డులు జారీ చేశాడు. అంతేకాకుండా ఏప్రిల్‌లో వారితో పది రోజుల పాటు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రవీంద్ర భారతి పరిసర ప్రాంతాల్లో స్వీపింగ్ పనులు చేయించాడు. ఉదయం 10 కాగానే మీరు వెళ్లిపోండి అంటూ వారిని పంపుతుడటంతో అనుమానం వచ్చి ఆరా తీశారు. తాను చెప్పిన రాజశేఖర్ అనే సూపర్‌వైజర్ జీహెచ్ఎంసీలో ఎవరూ లేరని తెలుసుకున్నారు. డబ్బులు పంపిన నెంబర్‌కు ఫోన్ చేయగా ఆ నెంబర్ ఆసిఫ్‌నగర్‌లో ఓ షాపు వ్యక్తిదని, ఆ వ్యక్తి తనకు ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులో తన పర్సెంటేజ్ తీసుకొని మిగతా డబ్బులు సాయికుమార్ ఇస్తానని తనకేమీ తెలియదని చెప్పాడు. కళావతి అనే మహిళ పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులకు ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న బీ.ఎస్ రాంబాబు

కాచిగూడ: దేశంలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని 'ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్' జాతీయ కార్యదర్శి బీఎస్. రాంబాబు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాల్లో ఐదు రోజుల పనిదినాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ రంగం బ్యాంకులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. శనివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీ, టీఎస్) ఆధ్వర్యంలో 75 ఏళ్ల డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా 33వ ద్వైవార్షిక సమావేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఎస్.రాంబాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణ విధానాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ బ్యాంకులు, సంస్థలు మనుగడ సాగిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి, రవీంద్రనాథ్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం



చేనేత వస్త్ర ప్రదర్శనలో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

కవాడిగూడ: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్సీ, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న జాతీయ చేనేత సిల్క్‌ఎక్స్‌పోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేతి వృత్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే కాదని, వినియోగదారులపై కూడా ఉండాలని సూచించారు. వివిధ రాష్ట్రాల స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. జూన్ 9 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రదర్శనను పొడిగించినందుకు ఎగ్జిబిషన్ చైర్మన్ కోటా దేవకీదేవి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎగ్జిబిషన్ డైరెక్టర్ సాయిచౌదరి, ఉమామహేశ్వర్ రావు, నిర్వాహకులు సత్యనారాయణ తదితరులున్నారు.

ఆందోళనతో జ్ఞాపశక్తిని కోల్పోతాం



మాట్లాడుతున్న డాక్టర్ రవ్వ హరికుమార్

చిక్కడపల్లి: ఆందోళనతో ఏకాగ్రత, జ్ఞాపశక్తిని కోల్పోతామని సైకియాట్రిస్ట్ డాక్టర్ రవ్వ హరికుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని డాక్టర్ హిప్నో జమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆందోళన నిర్మూలన మార్గాలపై ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ.. తీవ్రమైన మానసిక ఆందోళన, సంక్షోభంతో భవిష్యత్తుపై బెంగ ప్రారంభమవుతుందని, వీటిన్నింటి నుంచి బయటపడే మార్గాలపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రం, ప్రతినిధులు డాక్టర్ క్యార్లిన్, డాక్టర్ రఘు, డాక్టర్ శ్రీనివాస్, షహీనా, డాక్టర్ రమేష్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: అన్నింటా వెనుకబడి ఆటో నడుపుకొంటూ దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల సంఘం ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ ఆర్టీఏ అధికారులకు విన్నవించారు. ఈ మేరకు ఆర్టీఏ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని, ఆటోలు కొనుగోలు చేయడానికి లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు రుణాలు ఇప్పించాలని మల్లేష్ విన్నవించారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని జ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఫరూక్ పాల్గొన్నారు.



ఆర్టీఏ అధికారికి ఆటో డ్రైవర్ల సమస్యలు వివరిస్తున్న మల్లేష్ తదితరులు

అణగారిన వర్గాల వాణి 'ఇప్టా'



ఇప్టా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి

హిమయాత్‌నగర్: దేశ సాంస్కృతిక చరిత్రలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రత్యేక స్థానం కలిగి ఉందని, అన్యాయానికి వ్యతిరేకంగా స్వరం పెంచడమే లక్ష్యంగా అణగారిన వర్గాల వాణి నేటికి పని చేస్తుందని ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్, సత్యనారాయణరెడ్డి భవన్, ఇప్టా రాష్ట్ర కార్యాలయం వద్ద శనివారం ఇప్టా (ప్రజా నాట్య మండలి) 81 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇప్టా పతాకాన్ని కందిమళ్ల ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర నేతలు కె.లక్ష్మీనారాయణ, కె.ఉప్పలయ్య, సైదులు, విజయ్, దప్పు వెంకన్న, వెంకటేష్, అలెట స్వామి, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు విలాస్‌రావు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని వినతి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్‌లో అక్రమ వాహనాల పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. శనివారం ట్రాఫిక్ పోలిస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌ను కలిసి గ్రీన్‌ల్యాండ్ హోటల్ నుంచి పటేల్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డుపై వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. పటేల్ నగర్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులకు సహితం అక్రమ పార్కింగ్ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. బీఆర్ఎస్ నాయకులు మహేష్, ఉదయ్‌గౌడ్, నగేష్‌ముదిరాజ్, సమీర్, సంతోష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై మలయప్పస్వామి



స్వామివారి దర్శనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం మలయప్ప స్వామి గజవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని వాహన సేవలో దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, బిందెతీర్థం, బాలభోగం, హవనము, బలిహరణం, మంత్రపుష్పం, ద్రావిడ ప్రబంధ పారాయణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, మహానివేదన, మంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం పల్లకీసేవ, రాత్రి స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని అధికారులు కోరారు.

ప్రశ్నించే గొంతుకను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలి

కాచిగూడ: విద్యావంతుడు, ప్రశ్నించే గొంతుకైన తీన్మార్ మల్లన్నను గెలిపించుకుని శాసన మండలికి పంపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కట్టెల సుభాష్ అన్నారు. శనివారం ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను కలిసి వారు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కొంతం సురేష్, ఐలి శ్రీనివాస్, గాదే సత్యనారాయణ తదితరులున్నారు.

మధ్యప్రదేశ్ సీఎంకు బీజేపీ నేతల సన్మానం



సీఎం మోహన్ యాదవ్‌తో సురేందర్‌రెడ్డి

సైదాబాద్: నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను బీజేపీ నాయకులు కలిసి సత్కరించారు. శనివారం ఉదయం నగరానికి చేరుకున్న ఆయనకు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి బేగంపేట విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. సురేందర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లయ్య జయంతి వేడుకలు



మల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న గడప శ్రీహరి తదితరులు

కవాడిగూడ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం వ్యవస్థాపకుడు ఏ.ఎల్ మల్లయ్య నిర్వహించిన పోరాటం ఫలితంగానే బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ చట్టబద్ధత లభించిందని తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, ఏర్వ బాలయ్య, కోశాధికారి ఎర్రబోయిన మల్లేష్‌లు పేర్కొన్నారు. శనివారం ఏ.ఎల్ మల్లయ్య 86వ జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ వైపు బీసీల హక్కుల కోసం మరోవైపు గంగపుత్రుల సంక్షేమానికి ఎనలేని పోరాటం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముదిరాజ్‌లను బీసీ- ఏ గ్రూప్‌లో చేర్చడానికి కొంతమంది ప్రయత్నించగా.. దానిని తీవ్రంగా అడ్డుకుని చివరి శ్వాసవరకు ఆయన పోరాటం చేశారన్నారు. గంగపుత్రులకు జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తి నినదించాడని కొనియాడారు. తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నాయకులు ఆర్.కె. భగవాన్, అంబటి మల్లయ్య సుధాకర్, రాంచందర్, హరిశంకర్, వెంకటస్వామి, సత్యనారాయణ, రాచమల్ల స్వర్ణలత, సంగీత, సునీత, సంగీత తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంత్యుత్సవాలు



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న సాయి శృతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శిల్పారామంలో వాగ్గేయ కారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో అకాడమీకి చెందిన 100 మందికి పైగా విద్యార్థులచే నిర్వహించిన సామూహిక 'సంకీర్తనార్చన', అహరిణ్ణశ బృందం ప్రదర్శించిన 'నృత్య రూపకల్పన' ఆహుతులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా హాజరైన యాంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ సరస్వతి ప్రదీప్, ప్రముఖ నటుడు, మోటివేషనల్ స్పీకర్ కేవీ. ప్రదీప్‌రావు, ప్రముఖ నర్తకి, నటి ఆశ్రిత వేముగంటి నందూరి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జోశ్యభట్ల జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తిలను అతిథులు అభినందించారు. ప్రముఖ చిత్రకారుడు హరీష్ భాగవతుల స్క్రిబల్ ఆర్ట్‌తో వేసిన అన్నమయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అకాడమీ విద్యార్థులు, ఈ వెంట్ మేనేజర్లు నందిని, యామిని, సంగీతాభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో గృహిణికి రూ. 26 లక్షల టోకరా

బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి మోసపోయిన మహిళ



హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ గృహిణిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 50 ఏళ్ల మహిళ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన లింక్‌ను ఓపెన్ చేసింది. దీంతో బాధితురాలిని అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు గోల్డ్‌మ్యాన్ సాచ్స్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఏ7 అవినాష్ యొక్క యునైటెడ్ బుల్స్' అనే గ్రూప్‌లో చేర్చారు. ఈ గ్రూప్‌లో స్కామర్లు స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ పద్ధతులు, పెట్టుబడి విధానాలపై వీడియోలు పోస్ట్ చేశారు. బాధితురాలికి అప్పర్ సర్క్యూట్ స్టాక్‌లను కొనుగోలు చేయమని ప్రోత్సహించారు. 5% నుండి 20% వరకు లాభాలు వస్తాయని నమ్మించారు. లాభాలు వచ్చాయని ఇతర సభ్యుల పేరుతో మెసేజ్‌లు చేస్తు వారు బాధితురాలిని నమ్మించారు. 25 రోజుల పాటు గ్రూప్‌ను స్టడీ చేసిన తర్వాత, బాధితురాలు భర్త నుండి డబ్బులు తీసుకొని మార్కెట్‌లో కేటుగాళ్లు సృష్టించిన నకిలీ ట్రేడింగ్ అకౌంట్‌లో పెట్టుబడులు పెట్టింది. మొదట కొంత లాభాలు వచ్చాయని నమ్మించి భారీగా టాటా కంన్జూమ్, ఆమ్‌కే కంపెనీలలో పెట్టుబడులు పెట్టాలని, ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాలని ఒత్తిడి చేశారు. అనంతరం బాధితురాలు 35 వేల షేర్లు గెలుచుకుందని నమ్మించారు. దీంతో బాధురాలు మరోసారి తన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి వారు చెప్పిన విధంగా డబ్బు చెల్లించింది. ఈ విధంగా విడతల వారిగా బాధితురాలి నుంచి స్కామర్లు మొత్తం రూ. 25, 82,700 కాజేశారు. అనంతరం బాదితురాలి ఫోన్‌లో యాప్‌ను తొలగించి, ఆమె ఖాతాను బ్లాక్ చేశారు. గ్రూప్‌లోని ఇతర సభ్యులను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ, ఎవరూ స్పందించలేదు. దీంతో మోసపోయానని బాదితురాలు నగర సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.